


# అంతర్జాతీయ విమానాశ్రయానికి శ్రీవారి పేరు

## టిటిడిలో కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం

## తిరుమల,శ్రీవారిమెట్టు వంద ఉచిత బస్సులు: చైర్మన్



తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలకొండల క్రింద దేవదేవుని పాదాలచెంతన ఉన్న రేణిగుంట విమానాశ్రయానికి "శ్రీవేంకటేశ్వర అంతర్జాతీయ విమానాశ్రయం"గా పేరు మార్పుకోసం టిటిడి బోర్డు ప్రతిపాదించింది. ఈ మేరకు టిటిడి పాలకమండలి ప్రధానంగా చర్చించి ఆమోదం తెలుపుతూ కేంద్రవిమానయానశాఖకు సిఫార్సు చేసింది. తిరుమలకు విమానాల్లో వస్తున్న భక్తుల సంఖ్య, విమానాల రాకపోకలు బాగా పెరిగాయి. రేణిగుంట విమానాశ్రయానికి వేంకటేశ్వరస్వామి పేరు మార్చడం, తిరుమలకు ఐకానిక్‌గా విమానాశ్రయానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా సిఫార్సు చేశారు. తిరుమలలో ఉచితంగా గమ్యస్థానాలకు భక్తులను చేర్చేందుకు అవసరమైన వంద విద్యుత్‌బస్సులను కేంద్రప్రభుత్వం సమకూర్చేలా కేంద్రమంత్రి హెచ్‌డి కుమారస్వామి అంగీకరించారు. అన్నమయ్యభవనంలో మంగళవారం ఉదయం టిటిడి పాలకమండలి అత్యవసర సమావేశం జరిగింది. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన కీలకంగా నిర్ణయించిన వివరాలను మధ్యాహ్నం తన క్యాంపు కార్యాలయంలో మీడియాప్రతినిధులకు ఆయన వివరించారు. అక్షరగోవిందం, హరికథావైభవం, భగవద్గీత అనుష్టాన బోధన, భజేశ్రీనివాసం, వన నిధి, గిరి జనార్ధనం, సన్మార్గం వంటి కార్యక్రమాలను నిర్వహించి జనబాహుళ్యంలోనికి విస్తృతంగా తీసుకెళ్ళేందుకు చర్చించారు. టిటిడి కళాశాలల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీని నిలిపివేయాలని ఏపిపిఎస్‌సికి సిఫార్సు చేశారు. ఇప్పటికే పనిచేస్తున్న 200మంది కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో త్రిసభ్యకమిటీ ఏర్పాటు జరిగింది. విద్యార్థుల్లో హైందవసనాతనధర్మం నేర్పిన మానవీయ విలువలను ,వ్యక్తిత్వవికాస కార్యక్రమాల్లో శిక్షణనివ్వడానికి సద్గమయ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టిటిడి హెచ్‌డిపిపి సమావేశం నిర్ణయించింది. ఇందుకోసం టిటిడికి చెందిన ఏడు పాఠశాలల్లో దాదాపు 1,600మంది విద్యార్థులకు డే స్కాలర్ విధానంలో శిక్షణనివ్వాలని చర్చించారు. ఈ సమావేశంలో టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి. బోర్డుసభ్యులు జి.భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మిలు పాల్గొన్నారు.



## దేవుని ఆశీస్సులు!

అన్నమయ్యభవనంలో మంగళవారం జరిగిన టిటిడి పాలకమండలి సమావేశంలో తుడ చైర్మన్, టిటిడి ఎక్స్‌అఫిషియో సభ్యుడు సి.దివాకర్‌రెడ్డి తొలిసారిగా హాజరయ్యారు. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ఎక్స్‌అఫిషియో సభ్యుడి హోదాలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. భక్తులకు సౌకర్యాలపై, అభివృద్ధిపై తనవంతు సహకారం అందిస్తానన్నారు.

# ముత్యాలపందిరిలో తాతయ్యగుంటగంగమ్మ దర్శనం

తిరుపతి(రవాణ),జూన్ 17ప్రభాతవార్త:



తిరుపతిగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మను ఐదవమంగళవారం ఉదయం విశేష అభిషేకాల అనంతరం ఆలయం లోపల, అమ్మవారి సన్నిధిని ముత్యాలతో ,రకరకాల పూలమాలలతో అలంకరించారు. ఆలయం గర్భగుడిలో పూర్తిగా విభిన్నంగా సుందరంగా తీర్చిదిద్దిన ఆలయ అర్చకులు గంగమ్మ తల్లిదీవెనలతో భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి జాతర ముగిసిన ఐదవ వారంలో ఈ అలంకరణలో భక్తులు ఉదయం నుండి రాత్రి వరకు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ జయకుమార్ చక్కటి దర్శనం చేయించారు.

# తోతాపురి రైతుకు అండగా ప్రభుత్వం

**- ఇప్పటికే ధర కేజీ రూ.12 నిర్ణయం**

**- రైతుల సందేహాలు నివృత్తికి 94910 77325, 08572-242777 హెల్ప్‌లైన్ ఏర్పాటు**

**- విలేకరుల సమావేశంలో ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి**

చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:



జిల్లాలో ఈ సీజన్‌లో తోతాపురి మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, రైతులు అపోహలను నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్‌లో మంగళవారం ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి మామిడి కొనుగోళ్ళు, విక్రయాలపై విలేకరుల సమావేశం నిర్వహించి జిల్లాలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి మాట్లాడుతూ జిల్లాలో తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక కేజీ తోతాపురి మామిడి ధర 12 రూపాయలుగా నిర్ణయించిందన్నారు. ఇందులో ఒక కేజీ తోతాపురి మామిడిపై ప్రభుత్వం 4 రూపాయలు సబ్సిడీ అందిస్తోందని, అలాగే పల్ప్ ఫ్యాక్టరీలు ఒక కేజీ తోతాపురి మామిడిపై రైతులు 8 రూపాయలు చెల్లింస్తారన్నారు. జిల్లాలో సుమారు 98 వేల ఎకరాల విస్తీర్ణంలో 5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి ఉత్పత్తి అవుతుందన్నారు. తోతాపురి మామిడి పంట దిగుబడి క్రమేపి పెరుగుతుందన్నారు. జిల్లాలో 35 ప్రాసెసింగ్ యూనిట్లు వుండగా ఇందులో ప్రస్తుత సీజన్‌లో 27 పల్ప్ ఫ్యాక్టరీలు మాత్రమే మామిడి పండ్ల ప్రాసెసింగ్ చేస్తున్నాయన్నారు. జిల్లాలోని మామిడి పల్ప్ ఫ్యాక్టరీల ద్వారా రోజుకు 7 వేల మెట్రిక్ టన్నుల మామిడి ప్రాసెసింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మామిడి దిగుబడి అధిక మొత్తంలో వుంటుందన్నారు. 2023 సంవత్సరంలో సైతం తోతాపురి మామిడి అధిక దిగుబడి వచ్చిందని, ఆ సమయంలో జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమలు అధిక మొత్తంలో మామిడి పండ్ల ప్రాసెసింగ్ చేయడం జరిగిందన్నారు. ఈ సమయంలో చేసిన మామిడి ప్రాసెసింగ్‌లో తయారైన సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల మామిడి పల్ప్ ఇంకా గుజ్జు పరిశ్రమల వద్ద నిల్వ వున్న కారణంతో ఈ సంవత్సరం మామిడి గుజ్జు పరిశ్రమల నుండి డిమాండ్ తక్కువగా వుందన్నారు. ఫలితంగా జిల్లాలో మామిడి ధరలు పతనం అయ్యాయన్నారు. జిల్లాలో మామిడికి తక్కువ ధర వుండటంతో రైతులు నష్టపోకూడదని నిర్ణయించిన ప్రభుత్వం తోతాపురి మామిడి కేజీ రూ.12 ధర నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 6వ తేదీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల్లో మామిడి రైతుకు కేజీ తోతాపురి మామిడిపై గుజ్జు పరిశ్రమలు రూ.8 చెల్లించాలని, మిగిలిన రూ.4 మద్దతు ధరను రారష్ట ప్రభుత్వం అదనంగా రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తుందన్నారు. జిల్లాలో 38 ర్యాంపులు, రెండు మండీల వద్ద మామిడి కాయలను అమ్ముకునే రైతులకు సైతం ప్రభుత్వం కేజీపై రూ.4 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మామిడి రైతుకు ప్రభుత్వం నిర్ధేశించిన ధర చెల్లించడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. మామిడికాయల కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రతి ప్రాసెసింగ్ యూనిట్, మండీలు, ర్యాంప్ వద్ద హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఒక విఆర్‌ఓతో కూడిన రెండు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## తోతాపురి రైతులకు టోకెన్ పద్ధతి

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:

తోతాపురి రైతును ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందని, తోతాపురి రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం టోకెన్ పద్ధతికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ తోతాపురి రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. వాతావరణ పరిస్థితులు, రైతులు తీసుకున్న జాగ్రత్తలతో ఈ సీజన్‌లో మామిడి దిగుబడి పెరిగిందని, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, యూక్రెయన్ యుద్ధం వల్ల మామిడి పల్ప్ ఎగుమతి తగ్గుముఖం పట్టిందన్నారు. అలాగే ప్రక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక, క్రిష్ణగిరి మార్కెట్, గుజ్జు పరిశ్రమల నుండి పార్లే, కోకోకోలా, పెప్సీ కంపెనీల వాళ్ళు ఎక్కువగా కొనుగోలు చేశారన్నారు. దీని కారణంతో జిల్లాలో రెండు సీజన్లలోను మామిడి గుజ్జు నిల్వలు అలాగే వుండిపోయాయన్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు గుజ్జు పరిశ్రమలు, రైతులు, రైతు సంఘాల నేతలతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి తెలపడం జరిగిందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు రైతులు ఎక్కడా నష్టపోకుండా వారికి న్యాయం జరిగేలా కేజీ మద్దతు ధర రూ.12తో మామిడి కొనుగోలు చేయాలని ఆదేశించారన్నారు. ప్రాసిసెంగ్ యూనిట్లు రైతుకు కేజీకు రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం రైతుకు కేజీపై రూ.4 మద్దతు ధర చెల్లిస్తోందన్నారు. రైతులు ఎలాంటి తొందర పాటు లేకుండా పంట కోత కోయవద్దని, మామిడి పక్వానికి వచ్చిన మాత్రమే కోయాలని తెలిపారు.

## కుప్పంలో మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు

**- సిఎం చంద్రబాబునాయుడు ఆదేశం**

చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:

కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో తీసుకున్న అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టి దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. నారాయణపురంలో ఓ మహిళను చెట్టుకు కట్టి మునికన్నప్ప, అతని కటుంబసభ్యులు అమానుషంగా వ్యవహరించారు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో సిఎం నారాచంద్రబాబునాయుడు ఈ ఘటనపై ఎస్పీ మణికంఠ చందోలుతో ఫోన్‌లో సంభాషించారు. ఈ విషయంపై ఎస్పీ మణికంఠ చందోలు సిఎం నారాచంద్రబాబునాయుడుతో మాట్లాడుతూ ఈ ఘటనపై ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేశామని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పక్కాగా వ్యవహరించాలని సిఎం ఆదేశించారు. అలాగే బాధిత కుటుంబానికి పోలీసులు అండగా వుండాలని సిఎం పోలీసులను ఆదేశించారు.

## ఆందోళన చెందొద్దు...ఆదుకుంటాం

**- మామిడి రైతులకు కలెక్టర్ భరోసా**



తిరుపతి కలెక్టరేట్, జూన్ 17 ప్రభాతవార్త :

జిల్లాలోని మామిడి రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మామిడి రైతులకు భరోసా ఇచ్చారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఆయన జేసీ శుభం బన్సల్, జిల్లా ఉద్యాన శాఖాధికారి దశరథరామిరెడ్డి తో కలిసి మామిడి సేకరణపై మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. వాతావరణ పరిస్థితులు, రైతులు తీసుకున్న జాగ్రత్తల వలన మామిడి దిగుబడి పెరిందని తెలిపారు. గడిచిన మూడు సంవత్సరాల కంటే గుజ్జు పరిశ్రమ ఈ సంవత్సరం ఎగుమతి ఎక్కువ చేయడం జరిగిందన్నారు. యుక్రేయన్ యుద్ధం వలన మామిడి పల్ప్ ఎగుమతి అనేది చాలా వరకు తగ్గిందన్నారు. రైతులకు ఎక్కడా కూడా నష్టం జరగకుండా సీఎం నారా చంద్రబాబు నాయుడు రైతులకు న్యాయం జరిగేలా మద్దతు ధర కిలో రూ.12ల కొనుగోలతో ప్రభుత్వం కొనేవిధంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.అలాగే ప్రాసెసింగ్ యూనిట్ వారు రైతులకు చెల్లించాల్సిన ధర 8 రూపాయలు, 4 రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కూడా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ రోజుతో గడిచిన వారం నుంచి తిరుపతి జిల్లాలో రోజుకు రెండు వేల మెట్రిక్ టన్నులు మనం రీచ్ అవుతున్నామన్నారు. మామిడి రైతులను ఆర్థికంగా సబ్సిడీ రూపంలో ప్రభుత్వం ఆదుకుంటుందన్న విషయాన్ని ప్రతి మామిడి రైతు తెలుసుకోవాలని సూచించారు. మరిన్ని సందేహాలకు 0877 2236007ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థానం కార్‌పార్కింగ్ టెండర్లు నిర్వహించినా ఆమోదం రాదాయే!

## డిపాజిట్లు చెల్లించిన కాంట్రాక్టర్ల రోదన .. ఎందుకీ జాప్యం:ఎక్కడ లోపం



*శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం కార్‌పార్కింగ్‌కు సంబంధించి మూడేళ్ళ పాటు దేవస్థానం ఆశించిన మొత్తం రాలేదని రద్దు చేస్తూ వచ్చారు. గత నెల జరిగిన టెండర్లో ఆశించిన మొత్తం వచ్చినా ఆమోదం పొందక పోవటం వెనుక రహస్యమేమిటి? సాధారణంగా ఇక్కడ టెండర్ జరిగినపుడు నిర్ణీత తేది నుంచి పార్కింగ్ ఫీజులు వసూలు చేసుకోవచ్చునని ఉత్తర్వులు కాంట్రాక్టర్‌కు ఇచ్చి, కమిషనర్ ర్యాటిఫికేషన్‌కు పంపే సంప్రదాయం ఉంది. అయితే ఈ సారి కమిషనర్ అనుమతి వచ్చే వరకు ఆర్డర్ ఇవ్వలేదు. కమిషనర్ కార్యాలయంలో ఈ ఫైలు ఎందుకు కునుకు తీస్తుందో అంతుపట్టడం లేదు.దాంతో రూ.1.1కోట్లు డిపాజిట్‌చేసిన కాంట్రాక్టర్ ఆ సొమ్ములకు వడ్డీలు చెల్లించుకుంటూ తిప్పలు పడుతున్నారు.*

శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు, యాత్రికులు వాహనాల పార్కింగ్ చేసుకొనుటకు స్థలాలను కేటాయించారు. స్వర్ణముఖి, టూరిస్టు బస్టాండు, సన్నిధివీధిలోనూ., రాజగోపురం పక్కన పార్కింగ్ చేసుకుంటూ ఫీజులు వసూలు చేసుకొనుటకు మూడేళ్ళుగా టెండర్లు పిలుస్తున్నారు. అయితే వైకాపా పాలనలో ఐదేళ్ల మీన మేషాలు లెక్కించుకుంటూ టెండర్లు ప్రక్రియ జరగలేదు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు నెలల ముందు టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు రూ.1.33 కోట్లకు టెండర్ దాఖలు చేసారు.అయితే దేవాదాయశాఖ కమిషనర్ రూ.1.6కోటి కంటే తక్కువ ఉంటే ఆమోదించలేదన్నారు. గత నెల 1న టెండర్ పిలిచారు. 7న టెండర్లు ఓపెన్ చేసారు.నిబంధనల ప్రకారం డిపాజిట్ చేయాల్సిన సొమ్ములకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి రూ.1.1కోట్లు డిపాజిట్ చేసుకున్నారు. జూన్ 1 నుంచి అనుమతిస్తామంటూ కాంట్రాక్టర్‌కు భరోసా ఇచ్చారు.అయితే ఇక్కడ ఇఓ టెండర్ల కంపారిటివ్ స్టేట్‌మెంట్ వేస్తూ కమిషనర్ ఆమోదానికి పంపారు. కమిషనర్ నుంచి ఆమోదం వచ్చిన తరువాత ఆర్డర్ ఇస్తామని తెలిపారు.

**కమిషనర్ ఆమోదానికి అడ్డంకు ఏమిటి?**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన టెండర్ ఆమోదానికి కమిషనర్ కార్యాలయానికి పంపి సుమారు ఒకటిన్నర నెల దాటింది. కానీ ఇప్పటి వరకు అనుమతి రాలేదు. మరి ఇందులో తిరకాసు ఏమిటో ముక్కంటీశునికే ఎరుక. ప్రభాతవార్తకు అందిన సమాచారంమేరకు ఈ ఫైల్ సంబంధిత మంత్రి వద్ద కునుకు తీస్తున్నట్లు సమాచారం. ఏదైనా నిర్ణయాలు తీసుకోవటంలో నత్తనడక కన్నా ఆలస్యంగా సాగుతున్నట్లు విమర్శలున్నాయి. కోటి రూపాయలు డిపాజిట్ చేసిన కాంట్రాక్టర్ వడ్డీలు చెల్లించుకోలేక తల్లడిల్లుతున్నారు. ఇక పార్కింగ్ ఫీజుల వసూళ్లు దేవస్థానంపై కూడా భారమే. పార్కింగ్ ఫీజులు వసూళ్ళకు సుమారు 18 మంది సిబ్బంది ఉంటున్నారు. పార్కింగ్ ఫీజులు వసూళ్ళు కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే ఆ 18 మంది దేవస్థానంలో ఉపయోగించుకోవచ్చు. మరి ఈ లొల్లిలో ఆంతర్యమేమిటో ముక్కంటీశునికే ఎరుక.

# మున్సిపల్ కార్పోరేషన్ స్థలం అప్పనంగా దోచేస్తారా!?

## పాత చాళుక్యలాడ్జి పై కూటమినేతల కన్ను -నేడే డీల్‌కు మున్సిపల్ కౌన్సిల్ చేతివాటం

తిరుపతి,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:

అధికారం మనచేతుల్లో ఉంది...అనుకున్నది జరిగిపోవాలనే ఆరాటం కూటమిపార్టీల నేతల మైండ్‌లో నిర్ణయమైందో ఏమో..., అంతే ఉన్న ఫళంగా తిరుపతినగరంలో కీలకమైన ఆర్టీసి బస్టాండుకు, రైల్వేస్టేషన్‌కు మధ్యప్రాంతంలోని మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని అప్పనంగా తమవారికి (కమీషన్లకు)కట్టబెట్టేందుకు సిద్దమైపోయారు. ఇక ఏముంది అందుకు అన్ని సన్నాహాలు పూర్తిచేసేసుకుని తీరిగ్గా బుధవారం ఉదయం జరిగే నగరపాలక కౌన్సిల్ సమావేశంలో దీన్ని ఆమోదించేందుకు అన్ని సిద్ధం చేసుకున్నారనేది తిరుపతివాసుల్లో చర్చ మొదలైంది. ఈ స్థలాన్ని తక్కువ ధరకు మార్కెట్‌విలువ కంటే తక్కువకు తమవారికి కూటమి పార్టీల నేతలు ఎవరి హవాచేసి ఫైల్‌కు ముగింపుపలుకుతారనేది మరి కొన్ని గంటల్లో తేలిపోనుంది. ఈ వ్యవహారంపై అటు తిరుపతివాసులు, పలువురు హోటళ్ళ యాజమాన్యం, చివరకు వైసిపి నేతలు కూడా విమర్శలు గుప్పించడం సంచలన చర్చనీయాంశంగా మారింది. గత దశాబ్ధ కాలంగా ఈ స్థలాన్ని గత టిడిపి ప్రభుత్వంలోగానీ, వైసిపి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ,పెద్దలు ఎవరూ చేజిక్కించుకునేందుకు సాహసం చేయకపోగా అలాంటి ఆలోచన కూడా రాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూటమినేతలు తామనుకున్నది తమను నమ్ముకున్నవారికి ఏదో



చేయాలనే కమీషన్ల వాటాలతో తక్కువ ధరకు టెండరు కూడా లేకుండా నామినల్ పద్దతిలో పాత చాళుక్యలాడ్జి స్థలాన్ని చేజిక్కించుకోనుండటం పెద్ద విమర్శగా మారింది. ప్రభుత్వస్థలాలను పరిరక్షించడంతోబాటు ప్రజలకు నష్టం కలిగించే పనులు చేయొద్దని, అలాంటి వాటి జోలికెళ్ళవద్దని ఇప్పటికే సిఎం చంద్రబాబునాయుడు,మంత్రి నారాలోకేశ్ కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అయినా కొందరు నేతలు ఇదేమీ తమకు నచ్చవనేది తిరుపతినేతల అత్యుత్సాహం. నగరంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న స్థలంలో ఈస్టుపోలీస్‌స్టేషన్‌కు పక్కనే మున్సిపల్ స్థలం 924 అంకణాలు ఉంది. ఈ స్థలంలో కొన్ని దశాబ్ధాల క్రిందట చాళుక్యలాడ్జి పేరుతో భవనం నిర్మించారు. అప్పట్లో ఈ లాడ్జి ప్రముఖులకు బస కల్పించింది. రాను రానుఈ భవనం నిర్వహణ భారంగా మారి గాలికొదిలేయడంతో అలాగే నిరుపయోగంగా మారింది. ఎంతో ఖరీదైన ఈ స్థలంపై ఇప్పుడు కూటమి పెద్దల కన్ను పడింది. ప్రస్తుతం తిరుపతిలో ఎంతో ప్రాధాన్యత ఉన్న బస్టాండు ప్రాంతంలో అంకణం ధర 15లక్షలు రూపాయలు పలుకుతోంది. 924 అంకణాలు 138కోట్లు రూపాయలు విలువైన ఈ ఖరీదైన స్థలం. అయితే కూటమినేతలు స్థలాన్ని విక్రయించే ధర అంకణం 60వేల రూపాయలుగా నిర్ణయించారనేది సమాచారం. ఇలా 5.4కోట్ల రూపాయలకే తక్కువ ధరకు పాతచాళుక్య భవనాన్ని కూటమినేతలు తమవారికి కట్టబెట్టేందుకు వ్యూహం రచించారు.133కోట్ల రూపాయల వరకు ప్రజా ఆస్తికి నష్టంవాటిల్లే ప్రమాదం ఉందనేది చర్చమొదలైంది. ఇంతకీ ఎంతో విలువైన ఖరీదైన ఈ స్థలాన్ని కొనుగోలుచేస్తున్నదెవరు?ఈ కథనడిపిన వెనుక కీలక నేతలు ఎవరనేది చంద్రబాబునాయుడు దృష్టిలో పడింది. అమ్మకాన్ని తక్షణం నిలిపివేయాలని వైసిపి నేతలు డిమాండ్ చేస్తున్నారు. ముహూర్తం ఖరారుచేసేసిన కూటమినేతలు వెనుకడుగువేస్తారా?లేక అప్పనంగా దోచేస్తారా?!అనేది కొన్నిగంటల్లో తేలిపోనుంది.










# తల్లికివందనం అమలుపై వైకాపా గగ్గోలు దారుణం

## ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, జూన్ 17 ప్రభాతవార్త

సూపర్ సిక్స్ పథకాల్లో కీలకమైన తల్లికివందనం పథకం అమలై పిల్లల తల్లులు సంతోషంగా ఉంటే వైకాపా శ్రేణులు గగ్గోలు పెట్టడం దారుణమని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది పాలనలోనే సిఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతూ ముందుకుసాగుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నా సిఎం చంద్రబాబు కష్టపడుతూ ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకుంటునా న్నరన్నారు. ప్రతి పిల్లవాడికి 13వేల రూపాయల వంతున దాదాపు 67లక్షల మంది విద్యార్థులకు 10వేల కోట్ల నిధులు జమ చేయడం ఆషామాషీ విషయం కాదన్నారు. తల్లికివందనం పథకంతో పేదలు ఎంతో లబ్ది పొందుతున్నట్లు తమకు



తెలుపుతున్నారని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు చెబుతున్నారన్నారు. వైకాపాను ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా వారి ప్రేలాపనలు మాత్రం ఆగడం లేదన్నారు. ప్రభుత్వంపై బురద చల్లాలని చూడడం దారుణమన్నారు. విద్యారంగంలో ఎపి నెంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు.పాఠశాలలకు త్వరలోనే మరిన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. త్వరలోనే కుప్పం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు మొదలవుతాయన్నారు. 1200కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరుగుతోందన్నారు. కుప్పంలో మహిళను కట్టేసి నిర్బంధించిన సంఘటనకు తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. వైకాపాకు చెందిన మీడియా ఈ తరహా ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ, కడ సభ్యురాలు సుగుణమ్మలు మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీమేరకు సిఎం చంద్రబాబు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టులో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సైతం అందుబాటులో తెస్తారన్నారు. తల్లికివందనం పథకంలో మంత్రి నారా లోకేష్ జేబుకు డబ్బులు వెళ్లాయని అవాకులు చెవాకులు పేలిన వైకాపా నేతలకు బుద్దుందా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయ, కడ సభ్యురాలు సుగుణమ్మ, మహిళా నేతలు వసంతమ్మ, శారదమ్మ, తిరుమగళ్, ఐటిడిపి వినోద్ పాల్గొన్నారు.

## ఘనంగా కెఇసి వైస్‌ఛైర్మన్
# డా॥సునీల్‌రాజ్ జన్మదిన వేడుకలు
### - 1606మంది విద్యార్థులకు 16.06కోట్ల భీమా.. హాస్టళ్లకు వితరణలు !!




కుప్పం, జూన్ 17 ప్రభాతవార్త

కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్‌రాజ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసారు. సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్‌రాజ్‌లు మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో చదువుతున్న 1606మంది విద్యార్థులకు లక్ష రూపాయల మేర రూ 16.06కోట్లతో గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించినట్లు ప్రకటించారు. అలాగే 2024-25లో టెన్త్, ఇంటర్ ఫలితాల్లో రాణించిన నియోజకవర్గంలోని విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. అలాగే విజలాపురం, రాళ్లబూదుగూరు ప్రభుత్వ హాస్టళ్లకు నీటిశుద్ధి యంత్రాలు, శెట్టిపల్లి బధిర పాఠశాలకు 30వీల్ ఛెయిర్లను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్, అధ్యాపకులు జగదీష్‌బాబు, లయన్స్‌క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శిరీషకు పార్టీల నేతలచే పరామర్శల వెల్లువ



కుప్పంరూరల్, జూన్ 17 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధి నారాయణపురం గ్రామంలో చేసిన అప్పు చెల్లించాలని శిరీష అనే మహిళను చెట్టుకు కట్టేసి నిర్బంధించిన విషయం విదితమే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శిరీషను మంగళవారం ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, తెలుగుమహిళలు పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల గోపి అధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కుప్పం ఏరియా ఆస్పత్రికి చేరుకుని శిరీషను పరామర్శించారు. జనసేన కోఆర్డినేటర్ నరేష్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్, నేతలు దేవరాజ్ తదితరులు బాధిత మహిళను పరామర్శించి ధైర్యం చెప్పారు. రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ ఆదేశాలతో సిడిపిఒ చంద్రకళ, సూపర్‌వైజర్లు శిరీషను జరిగిన సంఘటనపై విచారించారు.

## మలేరియా నివారణ ప్రథమ కర్తవ్యం

పుంగనూరు రూరల్, జూన్ 17, ప్రభాతవార్త



మలేరియా మాసోత్సవం సందర్భంగా జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి దోమల లార్వా నిర్మూలనపై మంగళవారం మున్సిపల్ కార్యాలయం సమావేశం నిర్వహించారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ తూర్పు మొగసాల హాస్పిటల్‌ను సందర్శించి ల్యాబ్ పనితీరు, రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అధికారి గంగయ్య, సూపర్వైజర్లు దేవప్రసాద్, ఆహానంద్, హెల్త్ అసిస్టెంట్స్ తేజోమూర్తి, సోమశేఖరాచారి పాల్గొన్నారు.

## అధికారుల ఆదేశాలు బేఖాతర్
### - స్వాతంత్ర సమరయోధుని భూమిలో నిర్మాణాలు

పుంగనూరు, జూన్ 17, ప్రభాతవార్త



స్వాతంత్ర కాలంలో జైళ్లలో మగ్గి, మాతృభూమి కోసం పోరాడిన పుంగనూరు తొలి ఎమ్మెల్యే బాడాల కృష్ణమూర్తి రావు కు ప్రభుత్వం ఇచ్చిన భూమి యదేచ్ఛగా ఆక్రమణకు గురైంది. రెండు రోజుల క్రితం ఈ విషయంపై వార్తలో ప్రధానంగా వార్త రావడంతో అధికారులు స్పందించారు. ఆక్రమణదారులకు హెచ్చరికలు చేశారు. అయితే స్థానికంగా ఆక్రమణ దారులకు వత్తాసు పలుకుతున్న ఒక తెలుగుదేశం నాయకుడు ప్రోద్బలంతో అక్రమణ దారులు మంగళవారం మళ్లీ అదే భూమిలో నిర్మాణాలు సాగించారు. ఈ విషయమై బాధిత స్వాతంత్ర సమరయోధుని కుటుంబం పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు కూడా అక్కడికి చేరుకుని హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఏమాత్రం స్పందన లేకుండా నిర్మాణాలు జరిపారు. పుంగనూరు పట్టణంలో యదేచ్ఛగా సాగుతున్న అక్రమ దందాలకు ఇది నిదర్శనం. దీనిపై బాధిత స్వాతంత్ర సమరయోధుడు బాడాల కృష్ణమూర్తి కుటుంబీకులు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించేందుకు సమాయత్తమవుతున్నారు.

# నిరసన కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరి
### - ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:

జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలంటే డిఎస్పీ స్థాయి అధికారితో తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. శాంతి, దేశభక్తికి సంబంధించిన నిరసన కార్యక్రమంకు సైతం ముందస్తు అనుమతి తీసుకోవాల్సి వుంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు అభిప్రాయం వ్యక్తపరచడం, శాంతియుతంగా నిరసన తెలియజేయడంలో కొన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పెద్దఎత్తున సమూహాలు గుమికూడే కార్యక్రమాలు, ఊరేగింపులు, ఆందోళనలకు ముందుగా డిఎస్పీ స్థాయి పోలీసు అధికారి అనుమతి తీసుకోవడం అవసరమన్నారు. వారం రోజుల ముందు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందులో కార్యక్రమం తేదీ, సమయం, ప్రదేశం, పాల్గొనే వారి అంచనా సంఖ్య, మైక్ వాడకం వంటి వివరాలు పొందుపరచాలన్నారు. పోలీసులు పరిస్థితిని సమీక్షించి అనుమతులు మంజూరు చేస్తాన్నారు. అలాగే ఊరేగింపు చేపట్టాలంటే ముందుగానే మార్గంను ఖరారు చేయాలన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి జరిమానా

చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడవుతూ పోలీసులకు పట్టుబడటం, ఓపెన్ ప్లేస్‌లో మద్యం సేవిస్తూ పోలీసులకు పట్టుబడటంతో వారికి 81 వేల రూపాయలు జరిమానా విధించారు. చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరంచిన మహేశ్వర్ నగర పరిధిలో మద్యం సేవిస్తూ వాహనాలు నడపడం, నిబంధనలకు వ్యతిరేకంగా ఓపెన్ ప్లేస్‌లో మద్యం సేవించడం వంటి వాటిపై సీనియర్ యాక్షన్‌కు దిగుతున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గత వారం రోజులుగా మద్యం సేవించి వాహనాలు నడుపుపుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ 18 మంది పట్టుకున్నారు. వీరిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిస్తే మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన 7 మందికి 70 వేల రూపాయలు, బహిరంగంగా మద్యం సేవిస్తూ పట్టుబడిన 11 మందికి ఒకొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున 11 వేల రూపాయలు జరిమానా విధించారు.

## రాయితీపై పశువుల దాణా



గుడిపాల, జూన్ 17 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం 50 శాతం రాయితీతో అందిస్తున్న పశువుల దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు కోరారు. మండల కేంద్రం గుడిపాలలో మంగళవారం పాడి రైతులకు ఆయన 50 శాతం రాయితీలో అందిస్తున్న పశువుల దాణాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసం కొరతను అధికమించడానికి ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీలో పశువుల దాణా అందిస్తోందన్నారు. పశుదాణా కావాల్సిన రైతులు పశుసంవర్ధకశాఖ అధికారులను సంప్రదించి 50 శాతం సొమ్ము చెల్లించి దాణాను కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ళ హేమాద్రి నాయుడు, మాజీ సర్పంచ్ రవినాయుడు,వెటర్నరీ డాక్టర్ సాయిసుధ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అరగొండ అపోలోచే 120 మందికి ఉచిత వైద్యపరీక్షలు

తవణంపల్లె, జూన్ 17 ప్రభాతవార్త:



అరగొండ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని పల్లెచెరువు గ్రామంలో మంగవారం నిర్వహించిన ఉచిత వైద్యశిభిరం ద్వారా 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అపోలో ఆస్పత్రి జనరల్ మేనేజర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఆస్పత్రి మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్ఓ కమృద్దీన్‌ల ఆధ్వర్యంలో ఈఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈమేరకు గైనిక్, జనరల్ పిజీషియన్, పీడియాట్రిక్‌లకు సంభందించి రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఇందులో శస్త్రచికిత్సల కోసం ఏడు మందిని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఈకార్యక్రమంలో అపోలో వైద్యులు డాక్టర్ చైతన్య, డాక్టర్ వినిత,డాక్టర్ గురుప్రశాంత్‌లతో పాటు అపోలో సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.




## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలి

పెద్దపంజాణి, జూన్ 17 ప్రభాతవార్త

రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన మరింత కల్పించాలని నాబార్డ్ జిల్లా మేనేజర్ సునీల్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీపాలేకర్ వ్యవసాయ ఉత్పత్తి దారుల కంపెనీ అధ్వర్యంలో శ్రీరామపురంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలను వివరించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వేరుసెనగ, కంది, ఉలవలు, జొన్నల సాగు, విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎడిఎ శివకుమార్, ఎపిమాస్ పిడి వినాయకరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ డా॥

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బాధిత మహిళను ఫోన్‌లో హోంమంత్రి పరామర్శ

కుప్పం, జూన్ 17 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధి నారాయణపురం గ్రామంలో చోటు చేసుకున్న సంఘటనలో ఆస్పత్రిలో ఉన్న శిరీషను మంగళవారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఫోన్‌లో పరామర్శించారు. బాధిత కుటుంబంకు అన్ని విధాలా అండగా ఉంటామని ఈసంఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధితురాలు ధైర్యంగా ఉండాలని ఆమెకు సిఎం చంద్రబాబునాయుడు అండగా ఉంటారని ఫోన్‌లో తెలిపారు. బాధితురాలి పిల్లల చదువు బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకుంటుందన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి : విజయ్‌కుమార్

చౌడేపల్లి, జూన్ 17 ప్రభాతవార్త



వసతి గృహాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ, మండల ప్రత్యేకాధికారి విజ యకుమార్ అన్నారు. స్థానిక ఎస్సీ బాలికలు, బాలురు, బిసి బాలుర వసతి గృహాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులను మెరుగు పరచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంద న్నారు. ఈమేరకు పనులు చేపట్టినట్లు వివరించారు. ఎస్సీ బాలికల వసతిగృహంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. వంటగది, మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా, గదులు వంటివి తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేసారు. వసతి గృహం చుట్టూ చేపట్టాల్సిన పనులను కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం మండల పరిపాలనా భవనంలో యోగాంధ్రపై చర్చించారు. ఆర్డబ్ల్యుఎస్ డిఇ సోమశేఖర్‌శ్రీనివాస్, ఎఇలు సురేష్‌రెడ్డి, చందన, హరి, విద్యాసాగర్, వసతి గృహాల వార్డన్లు దీప, సురేష్, చెంగారెడ్డిలు పాల్గొన్నారు.

## వైష్ణవీమాతకు పంచామృతాభిషేకం

చౌడేపల్లి, జూన్ 17 ప్రభాతవార్త



మండలంలోని పుదిపట్ల స్వయం భు వైష్ణవీమాతకు పంచామృతా భిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ఆలయ ప్రధానార్చ కురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. కాటిపేరికి చెందిన అనంతకుమార్, వరలక్ష్మిలు ఉభయదారులుగా వ్యవహరించారు.

## కార్మికుల జీతాలు పెంచాలి : కార్మికులు డిమాండ్

పుంగనూరు, జూన్ 17, ప్రభాతవార్త



పట్టణం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రెండో రోజు నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం ఒక గంట ప్రాంతంలో కార్మికులు సంఘం సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచాలని, కారుణ్య నియామకాలను చేపట్టాలని, ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం 29 వేల రూపాయల మంజూరు చేయాలని కోరారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## హామీల అమలులో చంద్రబాబు విఫలం



సదుం, జూన్ 17, ప్రభాతవార్త

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీలను అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. మంగళవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఇండియన్ బ్యాంక్ రోడ్డు సద్నున నందు జగన్ అంటే నమ్మకం"చంద్రబాబు అంటే మోసం అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలం అవుతున్న ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అన్నారు .మద్దతు ధర లభించక టమాటా ,మామిడి రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి,సద్నుు మండలంలోని అందరూ రాష్ట్ర మరియు జిల్లా స్థాయి, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి విభాగాల సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వాటర్ షెడ్ ఛైర్మన్లు, సింగిల్ విండో ఛైర్ పర్సన్, మాజీ ప్రజాప్రతినిధులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## స్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో ఆందోళన

యర్రావారిపాలెం, జూన్ 17, ప్రభాతవార్త



యర్రావారిపాలెం మండలంలోని ఉస్తికాయలపెంట లో ఉన్న యూపీ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఊర్లో ఉన్న స్కూల్‌ని పులిచెర్ల వాళ్ళపల్లి నాలుగు రోడ్ల వద్దకు మార్చగా ఇక్కడ నుండి సుమారు ఐదు కిలోమీటర్లు వెళ్లాలని ఇప్పటికే 45 నుంచి 50 మంది ఉన్న విద్యార్థులు ఉన్నపలంగా స్కూల్ అక్కడికి మార్చడంతో తమ ఊర్లో ఉన్న స్కూల్ని అలాగే ఉంచాలని అభివృద్ధి చేస్తే వాళ్ళు స్కూల్‌ని అభివృద్ధి చేయాలని తమ పిల్లల్ని వేరొక చోటకు మార్చకూడదని విద్యార్థులు తల్లిదండ్రులు స్కూల్ ఎదుట బేటాయించి ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న యర్రావారిపాలెం ఎస్సై బాలకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.

# 207 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ
### కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి కార్పొరేషన్, జూన్ 17, ప్రభాతవార్త



నగరపాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 207 మందికి టిడిఆర్ బాండ్లను పంపిణీ చేశామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని అన్నారు. ఇందులో అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్లైన్ చేశామని అన్నారు. పలు మార్లు టిడిఆర్ కమిటీ సభ్యులు ఆన్లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించామని అన్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 207 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశామని అన్నారు. కాగా మంగళవారం ఆన్లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు 187 మందిని ఎంపిక చేశామని అన్నారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వెంటనే టిడిఆర్ బాండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో డిసిపి మహాపాత్ర, ఏసిపిలు బాలాజి, మూర్తి, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# ముంబయిలో ఆత్మహత్య చేసుకున్న పుత్తూరు యువకుడు
### ప్రతిభ చూపినా ఉద్యోగాలు రాకపోవడంతో మనస్తాపం

పుత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త :



పోటీ పరీక్షల్లో మంచి ర్యాంక్‌తో ప్రతిభ చూపించినా తనకు ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెందిన పుత్తూరు పట్టణానికి చెందిన ఒక మాధుర్ (26)యువకుడు నవీ ముంబైలో ఈ నెల 14న ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పట్టణంలోని ఎన్జీవో కాలనీకి చెందిన జార్జ్, స్వర్ణలత కుమారుడైన ఎస్.ఆర్.శ్రీమాధుర్ ముంబయిలో ఎస్‌బిఐలో ఐటి విభాగంలో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో 2024వ సంవత్సరంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిర్వహించిన సైంటిఫిక్ అసిస్టెంట్ పరీక్షలో తాను అయిదో ర్యాంక్ సాధించాడు. అయితే పరిపాలనాపరమైన సమస్యలతో ఆ రిక్రూట్‌మెంట్‌ను రద్దు చేసి కొత్తగా పరీక్ష నిర్వహించేందుకు ప్రకటన ఇచ్చింది. దీంతో కొంత మనస్తాపం చెందిన మాధుర్ తాను పనిచేస్తున్న ఎస్‌బిఐలో క్లౌడ్ ఆపరేషన్ విభాగంలో డిప్యూటీ మేనేజర్ ఇంటర్వ్యూలో ప్రతిభ కనపరిచినా ఆ ఉద్యోగానికి ఎంపికి చేయలేదు. మంచి ఉద్యోగాలకు రెండు సార్లు తాను ఎంపికైనా వివిధ కారణాలతో నియామక ప్రక్రియను నిలిపివేయడం తనను కలచి వేసిందని, దానిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు తల్లితండ్రులను ఉద్దేశిస్తూ ఈ నెల 14న ఒక ఉత్తరం రాసి ఉరి వేసుకని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఎపుడూ ఫోన్‌లో టచ్‌లో వుండే కుమారుడు ఎంతకూ ఫోన్ చేయకపోవడం, తాము చేసినా తీయకపోవడంతో అనుమానంతో తల్లితండ్రులు ముంబయిలోని మాధుర్ ఇంటి యజమానులకు ఫోన్ చేశారు. మాధుర్ ఆత్మహత్య విషయం తెలుసుకుని ముంబయి వెళ్లారు. అక్కడ కేసు నమోదు చేసిన పోలీసులు పోస్ట్‌మార్టం అనంతరం మాధుర్ మృతదేహాన్ని తల్లితండ్రులకు అప్పగించారు. తమ కుమారుడి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని మాధుర్ తల్లితండ్రులు మంగళవారం డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత పరీక్షల నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# అమ్మకానికి తిరుపతి...కార్పొరేషన్ ఆస్తులను అమ్మితే ఊరుకోం
### - కూటమి నేతలకు వైఎస్ఆర్‌సీపీ నేతల హెచ్చరికలు



తిరుపతి హెల్త్, జూన్ 17 ప్రభాతవార్త :

తిరుపతి ప్రజలకు సొంతమైన కార్పొరేషన్ ఆస్తులను అమ్మితే ఊరుకునేది లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు హెచ్చరించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు పసుపులేటి హరి ప్రసాద్, వాసు యాదవ్ మాట్లాడారు. తాళ్ళపాక పెద్ద గంగమ్మ ఆలయం వద్ద ఉన్నటువంటి చాళుక్య లాడ్జిను అమ్మడానికి పెడుతున్నటువంటి తీర్మానాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. అంతే కాకుండా ఎక్కడెక్కడ విలువైన తిరుపతి కార్పొరేషన్ ఆస్తులున్నాయో వాటన్నింటిని అమ్మడానికి కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. వారి ఆటలను వైఎస్ఆర్‌సీపీ పార్టీ నేతలు, కార్యకర్తలు సాగనివ్వరని కూటమి నేతలు, కార్యకర్తలకు వారు హెచ్చరికలు జారీ చేశారు. అంతే కాకుండా మాజీ డెప్యూటీ మేయర్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమానికి సిద్ధం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రవికుమార్, రమణారెడ్డి, బాలాజీ, నరేష్, తేజరాయల్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## డయేరియాపై అవగాహన తప్పనిసరి

చంద్రగిరి, జూన్ 17 ప్రభాతవార్త: ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అనుసరించి డయేరియాపై ప్రజలు తప్పనిసరి అవగాహన కలిగివుండాలని డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక బీడి కాలనీలో మంగళవారం జరిగిన గ్రామ సమాఖ్య సమావేశంలో డయేరియా, దోమల నివారణా చర్యలు, లింగ నిర్ధారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రస్తుతం వర్షాల కారణంగా నీరు కలుషితమయ్యే అవకాశం వున్నందున ప్రతి కుటుంబం కాచి చల్లార్చిన నీటినే త్రాగాలని సూచించారు. ప్రతి కుటుంబం వారంలో ఒక్క రోజు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం అలవరుచుకోవాల న్నారు. ఆ రోజున పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడంతో పాటు ఎక్కడా వర్షపు నీరు నిల్వ లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. డయేరియా, డెంగీ వంటి వాటికి సకాలంలో చికిత్సలు అందించడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుండి బయటపడ వచ్చన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శివకుమారి, సిసి నసీఫ్ జాన్, ఆశా కార్యకర్త మోనిక, సంఘమిత్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వేరుశనగ రైతులకు రాస్ అవగాహన

రేణిగుంట జూన్ 17 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం కొత్త ఢిల్లీ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో రైతులకు వ్యవసాయ సాగుపై శిక్షణతో పాటు విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం 30 సంవత్సరాలుగా రైతుల సంక్షేమం కోసం ఎన్నో సేవలు చేస్తుందన్నారు. వేరుశనగ పండించడంపై సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే 100 నుండి 105 రోజులలో పంట చేతికొస్తుందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ దివ్య, సుధాకర్, రాము కుమార్, దివ్య సుధా, వివిధ మండలాలకు చెందిన వేరుశనగ రైతులు పాల్గొన్నారు....

## యుద్ధం ఆపండి... ప్రాణాలు కాపాడండి

రేణిగుంట జూన్ 17 ప్రభాతవార్త : పాలస్తీనా... ఇరాన్ పై ఇజ్రాయిల్ ప్రభుత్వం చేస్తున్న మారణకాండను వెంటనే ఆపాలని వామపక్ష నేతలు, పలు ప్రజా సంఘాల నేతలతో కలిసి మంగళవారం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఓ వి రమణ, సిపిఎం మండల కార్యదర్శి హరినాథ్, సిపిఐ నాయకులు తులసి రాజన్,లౌకిక పరిరక్షణ వేదిక ఆవాజ్ సంఘం సమన్వయ కన్వీనర్ ఎస్. షానవాజ్, మహమ్మద్ వల్లి, కరీముల్లా, భాష, నిజాముద్దీన్, దిలీప్ భాషా, ఆశ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జూలియన్ రాజు, సిపిఎం పార్టీ రేణిగుంట కార్యదర్శి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఐద్వా మండల కార్యదర్శి రాజేశ్వరి, రాజశేఖర్, సెల్వరాజ్, కృష్ణ, సుజాతమ్మ, దీప, భారతి, పద్మ, వెంకటరమణ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ అధ్యక్షతన ఉపాధి హామీపై గ్రామసభ



రేణిగుంట, జూన్ 17 ప్రభాతవార్త : పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం సర్పంచ్ నాగేశం అధ్యక్షతన ఉపాధి హామీ సామాజిక తనిఖీ పై ఉపాధి హామీ మహిళలతో గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో 202425 సంవత్సరానికి చెందిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన వివరాలను సి ఆర్ పి లోకేష్, డి ఆర్ పి గురుస్వామి వివరించారు. అంతకుముందు ఉపాధి హామీ కూలీలు కార్యాలయ ఆవరణలో రంగవల్లులు వేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మాధవి, ఏపీవో దీప, రేణిగుంట ప్రజలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు కిట్లు పంపిణి



శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు కేటాయించిన విద్యాసామగ్రి కిట్లును మంగళవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్,బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై అందించారు. పట్టణంలోని సంతమైదానం మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కిట్లును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సదుపాయాల కన్నా విద్యా సదు పాయం మిన్న అని భావించిన యువనాయకుడు లోకేష్ ఈ పథకాన్ని రూపొందించారన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఇఓ బాలయ్య,షాకిర్ అలి, మాజీ టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాషా, అస్మత్, జి.విజయకుమార్ నాయుడు పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాసామగ్రిని అం దించారు.

## విజ్ఞానగిరి ఆధునీకరణ అద్బుతం



శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆధునీకరణ పనులతో కొత్త అందాలు సంతరించు కోనున్నాయని, ఆడికృత్తిక లోపల పనులు పూర్తి చేయాలని కోరారు. మంగళవారం ఆలయంలో వెలసిన స్వామిని దర్శించుకొని పూజలు జరిపించుకున్న ఆయన ఇక్కడ అమలు జరుగుతున్న పనులను పరిశీలించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయాల్లో సుబ్రమణ్యం స్వామి ఆలయానికి ఆడికృత్తికి కనీసం లక్ష మంది భక్తులు దర్శించుకోవటం ఆనవాయితి అని వివరిస్తూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు నత్తనడకన నడుస్తున్నాయని అధికారులు,పాలకులు చొరవ చూపి కాంట్రాక్టర్‌ను పరుగులు తీయించాలని కోరారు. ఆలయానికి చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు పనులు చేపట్టలేదన్నారు. ఆలయంలో కనీసం 20 మంది కూడా కూర్చొనే పరిస్థితి లేదన్నారు. జీర్ణోద్ధారణ తరువాత కనీసం 2వేల మంది కూర్చొనే అవకాశం ఉందన్నారు. ఆయనతో పాటు సురేష్, కొల్లూరు హరినాథ నాయుడు, బాలాజి, భాను, ప్రసాద్,ఈశ్వర్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన పానగల్ జాతర



శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వేసవి సమయంలో జాతర్లు,పొంగళ్ళు సంబరాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరతో పాటు శ్రీకాళహస్తిలోని బాబూ అగ్రహారంలో జాతర నిర్వహించటం ఆనవాయితి. తరువాత 15 రోజులకు పానగల్ జాతరను నిర్వహిస్తారు.ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి చాటింపుతో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. వారం రోజుల నుంచి పానగల్ జాతర సన్నాహాల్లో నిర్వహణ కమిటి తలమునకలై ఉన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వెలసిన గ్రామదేవతగా 'పానగల్‌లోని పొన్నాలమ్మ' ఆలయంలో పొంగళ్ళు సంబరాలు చోటు చేసుకున్నాయి.పొన్నాలమ్మ ఆలయం చుట్టుపక్కల ఏడు గ్రామాలకు ఈ ఆలయం వేదికగా ఉంది. పానగల్, అగ్రహారంలలో జాతర సందర్భంగా ఇక్కడ పొంగళ్ళు నిర్వహించటం ఆనవాయితి.శ్రీకాళహస్తి పానగల్ జాతర సందర్భంగా మంగళవారం ఉదయంయం నుంచి పొన్నాలమ్మ ఆలయం మహిళ భక్తులతో కిట కిట లాడింది. వందలాది మంది మహిళలు ఇక్కడ పొంగళ్లు పెట్టుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పానగల్,శ్రీరామ్‌నగర్ కాలనీలో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. పానగల్‌లో సుమారు 5కిలో మీటర్ల వరకు విద్యుత్ దీపాల తోరణాలతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. పొన్నాలమ్మ ఆలయం వద్ద పొంగళ్ళ సంబరాలు చోటు చేసుకున్నాయి.

## శ్రీకాళహస్తి తహశీల్దార్‌గా జనార్ధన్‌రాజు



శ్రీకాళహస్తిరూరల్,జూన్ 17 ప్రభాతవార్త : తహశీల్దార్‌గా జనార్ధన్‌రాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇక్కడ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జనార్ధన్‌రాజు తరువాత తన సొంత అన్నమయ్య జిల్లాకు బదిలి అయ్యారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో జనార్ధన్‌రాజుకు శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో శివయ్య పాదాల చెంత పనిని చేసే అవకాశం లభించింది. శ్రీకాళహస్తి మండలం, మున్సిపాలిటి పట్ల అవగాహన ఉన్న అధికారి జనార్ధన్‌రాజు.ఇక్కడ తహశీల్దార్ పని చేసిన లక్ష్మీనారాయణను జిల్లా కలెక్టర్‌కు బదిలి చేసినట్లు సమాచారం.

## తొట్టంబేడు తహశీల్దార్‌గా భారతి

తొట్టంబేడు,జూన్ 17 ప్రభాతవార్త : తొట్టంబేడు తహశీల్దార్‌గా సి.భారతిని నియమించారు.గతంలో ఆమె తిరుపతిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేసిన భారతిని తొట్టంబేడు మండల తహశీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారి చేసారు.ఇక్కడ పని చేసినమధుసూధనరావును జిల్లా కలెక్టరేట్‌లో రిపోర్టు చేయమని ఆదేశించారు. డెప్యూటీ తహశీల్దార్‌గా జీనవ్ కుమార్, తిరుపతి అర్బన్ రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తే ఇక్కడ బదిలి చేసారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కొత్త అధికారులకు అవకాశం కల్పించారు

## కోర్టుకు హాజరుకాక తిరుగుతున్న వ్యక్తి అరెస్టు

తొట్టంబేడు,జూన్ 17 ప్రభాతవార్త : ఓ దోపిడి కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తి కోర్టు వాయిదాలకు హాజరు కాక తప్పించుకు తిరుగుతుండటంతో కోర్టు సీరియస్‌గా భావించింది.మంగళవారం ఆ వ్యక్తిని అదుపులో తీసుకున్నట్లు టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి వివరించారు.ఎఎం పుత్తూరుకు చెందిన హేమంత్‌కు కోర్టు అరెస్టు వారెంట్‌జారి చేసింది. అయితే ఆతను కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతుండా కోర్టు ఆదేశాల మేరకు టూటౌన్ పోలీసులు కాపు కాచి ఆదుపులో తీసుకున్నారు. పోలీసులు బాబూరావు,రేగన్‌లు అదుపులో తీసుకున్నారని జైలుకు తరలించారన్నారు.

## మహిళలు బాలికల సాధికారపచటంలో తేజోభారత్ కృషి

-జిల్లా కలెక్టర్‌కు వివరించిన కోలా విశాలాక్షి



శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త: నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మహిళలు, బాలికలను సాధికారచటంలో 'తేజో భారత్' నాలుగేళ్ళుగా చేపట్టిన ప్రగతిని ఆ సంస్థ వ్యవస్థాపకురాలు కోలా విశాలక్షి మంగళవారం వివరించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సతీమణి మహిళ సామాజిక కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్‌ను కలసి తమ సంస్థ చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద మహిళలు బాలికలకు,విద్యార్థులకు పరిశుభ్రత,వ్యక్తిగత పరిశుభ్రత,మంచి ఆరోగ్యంపై చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలు ఫలితాలను వివరించారు. అచరణకు అవసరమైన మెటీరియల్స్‌ను అందించటం జరిగిందని కలెక్టర్‌కు వివరించారు.ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టే సమయంలో తమకూ అవకాశం కల్పించాలని కోరారు. 2023-24 సంవత్సరం తేజోభారత్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో 12 నుచి 45 సంవత్సరాల మహిళలకు అవగాహన కల్పించే 5200 పుస్తకాలను శానిటరి నాప్కిన్స్ పంపిణి చేసినట్లు వివరించారు. ఈ ఏడాది ఇంకా ఎక్కువ స్థాయిలో అనగా 10వేల మందికి సేవలందించుటకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్‌కు వివరించగా ఆయన అభినందించారు.కలెక్టర్‌ను కలంకారి కళాఖండంతో సత్కరించారు.ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో అవకాశం కల్పిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. వారితో పాటు కోలా హేతేజ్, కోలా వేదాంత్‌లు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ని ఆకస్మిక తనిఖీ

కేవీబీ పురం, జూన్ 17 ప్రభాతవార్త: కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌ను నారాయణ వనం రూరల్ సీఐ రవీంద్ర ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎఫ్ఐఆర్, ఇండెక్స్, ఎంసీఆర్ రికార్డు, జీడీ సెంట్రల్ రికార్డు, విజిట్ రికార్డు సస్పెక్టెడ్ రికార్డు, ఇతర రికార్డులను పరిశీలించారు. నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్ఐ నరేష్‌ని సీఐ ఆదేశించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై, మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## ఘనంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పుట్టిన రోజు వేడుకలు



కేవీబీ పురం, జూన్ 17 ప్రభాతవార్త: కేవీబీ పురం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వి.థామస్ పుట్టిన రోజు వేడుకలు కేవీబీ పురంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీమండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు, టీడీపీ రైతు విభాగ అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు నల్లిబాబులు థామస్‌కి ఆశీర్వచనాలు అందజేశారు. కేవీబీపురం సాయిబాబా ఆలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి కొప్పుల లావణ్య కుమార్, ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి హేమకుమార్, పిడుగు విజయ కుమార్, కొమ్మ సతీష్, వి.రాజేష్, విజయ్, సిద్ధు, ప్రశాంత్, విమల్, సందీప్, హరీష్, రాజశేఖర్, శరవణ, నరేష్, క్రరేయ్య టీచరు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అంతా శూన్యం

కేవీబీ పురం, జూన్ 17 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి లేక అంత శూన్యంగా ఉందని సత్యవేడు వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. కేవీబీ పురం మండల కేంద్రంలో వైసీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య అధ్యక్షతన జగన్ అంటే నమ్మకం-బాబు అంటే మోసం అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఇంకా ప్రమాణ స్వీకారం దగ్గరే ఆగిపోయిందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు తప్పుడు హామీలు ఇవ్వడం కొత్తేమీ కాదని, అధికారంలోకి వచ్చిన తరువాత ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయడం సర్వసాధారణమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు బీరేంద్రరాజు, ఉమ్మడిజిల్లాల ఉపాధ్యక్షుడు తెరణి ధనంజయరెడ్డి, పార్టీ కార్యదర్శి లాల్ బాబుయాదవ్, వైస్ ఎంపీపీ శీను యాదవ్, పార్టీ ముఖ్య నేతలు వేనాటిచందు, నందకుమార్, దశరథ, రామిరెడ్డి, శాస్త్రిరాజు, మణి, అయ్యప్ప, గోపి, హరి, గిరి, రామ్మోహన్‌వర్మ, రాజేష్, ఎంపీటీసీ అయ్యప్ప పాల్గొన్నారు.

## రాయపేడులో క్రికెట్ టోర్నీ

కేవీబీ పురం, జూన్ 17 ప్రభాతవార్త: మండలంలోని రాయపేడు గ్రామంలో నేడు బుధవారం నుంచి అంబేద్కర్ యూత్ క్రికెట్ టోర్నీని ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ యువతకు మానసిక ఉల్లాసాన్ని కలిగించడం కొరకు ప్రతి సంవత్సరం తన గ్రామంలో ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఎంపీపీ స్కూలుని బేసిక్ స్కూలుగానే ఉంచాలని ధర్నా

కేవీబీ పురం, జూన్ 17 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలం పాతపాళెం దళితవాడలో ఎంపీపీ స్కూలుని బేసిక్ స్కూలుగానే ఉంచాలని గ్రామ ప్రజలు, విద్యార్థి తల్లిదండ్రులు, చైర్మన్, సర్పంచ్‌లు, స్కూలు కమిటీ చైర్మన్, సభ్యులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1 నుంచి 5 వరకు బేసిక్ స్కూలుగా ఉంచాలని మంగళవారం పాతపాళెం ఎంపీపీ స్కూలు వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాతపాళెం దళితులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాలస్తీనాకు సంఘీభావం తెలియజేసిన సీపీఎం, సీపీఐ

పుత్తూరు రూరల్, జూన్ 17 ప్రభాతవార్త: పాలస్తీనా ఇరాన్‌లపై అమెరికా అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమాన్ని వెంటనే ఆపాలని, సంఘీభావ నిరసనలో భాగంగా జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పుత్తూరు పట్టణంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్, నాయకులు విజయ్, రమేష్, బాషా, కృష్ణమూర్తి, సీపీఐ నాయకులు కృష్ణారెడ్డి, దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరణ

సత్యవేడు, జూన్ 17 ప్రభాతవార్త: సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాలన్నారు. కళాశాలలో తెలుగు, ఆంగ్లం మాధ్యమాల్లో విద్యాబోధన ఉంటుందన్నారు. విద్యార్థుల ఆసక్తి మేరకు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంబైపీసీ కోర్సుల్లో చేరవచ్చునన్నారు.

## ఏఈఈగా గిరీష్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

విజయపురం, జూన్ 17 ప్రభాతవార్త: విజయపురం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈగా కె.గిరీష్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కార్వేటినగరం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా విజయపురం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మంచినీటి సమస్యపరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రజలు కాని, ప్రజాప్రతినిధులు కాని మంచినీటిసమస్యను తన వద్దకు తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

## శ్రీసిటీలో అగ్ని ప్రమాదం

సత్యవేడు, జూన్ 17 ప్రభాతవార్త: సత్యవేడు శ్రీసిటీలోని చెంగంబాకం గ్రామంలో నిల్వ ఉంచిన పరిశ్రమల వ్యర్థాల డంపింగ్‌యార్డులో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో ఉలిక్కిపడ్డ పారిశ్రామిక వాడలోని గ్రామాలు....శ్రీసిటీ పారిశ్రామికలో ప్రపంచ స్థాయిలో పరిశ్రమలకు మౌలిక సదుపాయాలతో పాటు అదే స్థాయిలో సేఫ్టీని కూడా అందిస్తున్న మరోవైపు విచ్చల విడిగా డంపింగ్‌యార్డుల అనుమతులు పొంది కొంత మంది పారిశ్రామికవాడ లోపలే డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేసుకుంటూ ఎలాంటి రక్షక వలయం లేకుండా ఉండడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అదే స్థాయిలో ప్రశ్నలు కూడా:**



అసలు శ్రీసిటీ పారిశ్రామిక వాడలోనే డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేసుకోవడం ప్రమాదకరమని తెలియదా...? ఈ స్థాయిలో వ్యర్థాలను ఒకే చోట డంపింగ్ చేయడం, అది కూడా శ్రీసిటీలోని పలు గ్రామాల్లో ఒక వేళ భారీ స్థాయిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుని గ్రామాలకు ముంపు అంచున పడి ప్రాణ, ఆస్థి నష్టం జరిగితే ఎవరు బాధ్యులు... వ్యర్థాలను తరలించే లైసెన్సులు అనుమతులు తీసుకున్నారు సరే.... అప్పటికప్పుడే తరలించి వాటిని ఖాళీ చేయకుండా గుట్టలు-గుట్టలుగా పేర్చుకుని ప్రమాద సంకేతాలు ఇస్తున్న సంబంధిత అధికారులు ఏం చేస్తున్నట్లు...? వీటిపై నిఘా పెట్టవలసిన వ్యవస్థ అలసత్వం, స్పష్టంగా కనబడుతోంది. అసలు గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడమేంటి...శ్రీసిటీ పారిశ్రామిక వాడలోని పరిశ్రమలు వ్యర్థాలను వెంట వెంటనే రీ సైక్లింగ్‌కు తరలించకుండా అదే పారిశ్రామిక వాడలో డమ్ చేయడమేంది. దీన్ని జిల్లా పాలనాధికారి, సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకోకపోతే వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే వీరి నిర్లక్ష్యానికి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీసిటీకే కాకుండా స్థానిక గ్రామాలకు పొంచి ఉన్నదనే విషయాన్ని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏదీ ఏమైనా డ్రీమ్ సిటీ(యువత ఉద్యోగ అవకాశాలకు)గ్రీన్ సిటీ అనే పేరు తెచ్చుకున్న ప్రముఖ పారిశ్రామిక వాడ అయిన ఈ శ్రీసిటీ సక్సెస్ రేట్‌ను ప్రధాన మంత్రిస్వయంగా మెచ్చుకోవడం గమనార్హం. దేశ విదేశాల పరిశ్రమలు, వేల సంఖ్యలో కార్మికులు, పరిశ్రమల్లో పని చేసే కీలక ఓ వైపు-మరోవైపు శ్రీసిటీలోని గ్రామాలు రక్షణ వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉంటే అంత మంచిది. శ్రీసిటీని అత్యుత్తమ పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో వెళుతున్న శ్రీసిటీ యాజమాన్యం, వారి సెక్యూరిటీ సిబ్బంది కూడా ఇలాంటి ప్రమాదకరమైన విషయాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డంపింగ్‌యార్డుకు అనుమతులు ఇస్తున్న అధికారులు కూడా అనుమతులు పొందిన వారిపై నిఘా పెట్టి నిర్లక్ష్యంతో, అలసత్వంతో విచ్చలవిడిగా ఎక్కడబడితే అక్కడ డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేసుకోకుండా నియంత్రించాల్సిన అవసరం కూడా అత్యంత కీలకం. చూడాలి మరి శ్రీసిటీ పోలీసులు, శ్రీసిటీ యాజమాన్యం, అధికారులు సంయుక్తంగా ఎలాంటి చర్యలు తీసుకుంటారో.

## శశిధర్‌కు ప్రవీణ్ ఘన సన్మానం



తిరుపతి విద్య, జూన్ 17 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన శశిధర్‌ను తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీన్ మంగళవారం శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. శశిధర్ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారునికి, క్రీడా సంఘానికి అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అసోసియేషన్ అధ్యక్షులు వై. ప్రవీణ్, కార్యదర్శి ఆర్. శ్రీధర్, కోశాధికారి సాయికుమార్, పుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డప్ప, శాప్ కోచ్‌లు మాలిని, ఆది, ప్రేమ్, గోపి, హరి, హిందూజా, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



తిరుపతి విద్య, జూన్ 17 ప్రభాతవార్త : తిరుపతి పట్టణంలో గల గవర్నమెంట్ యూత్ హాస్టల్ నందు హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్రం 2025-2028 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నిక ఘనంగా నిర్వహించారు. హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ కమిటి ఆధ్వర్యంలో అతుల్‌కుమార్ సోధాని రఘువీర్ చౌదరి రాష్ట్ర నోడల్ అధికారిగా హబీబ్ భాషా ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సమిష్టిగా ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్ హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర శాఖ పేట్రన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఎన్నికల్లో సింగూరు మోహన్‌రావు ప్రెసిడెంట్ గాను, పుల్లూరు దయాకర్ ఛైర్మన్‌గాను, బానా నాగేశ్వర్‌రెడ్డి సెక్రటరిగాను, వైస్ ప్రెసిడెంట్స్‌గా పెనరంక వెంకటరమణ, మునిశేఖర్, జితేంద్ర, వెంకట శేషమ్మ, నాగ వాసవి, బీఎస్ చంద్రమౌళేశ్వరరావు ట్రెజరర్‌గాను, చింటు మురళీ నాయుడు చీఫ్ కమిషనర్‌గాను రాజగిరి హరివితల్ హెడ్ క్వార్టర్ కమీషనర్‌గాను, తుంగ శ్రీకాంత్ స్టేట్ ఆర్గనైజింగ్ కమీషనర్‌గాను దుంపల వెంకట అప్పులు నాయుడు, స్టేట్ లీగల్ కమీషనర్ గాను, సిడగ రోహిణి స్టేట్ జాయింట్ సెక్రటరీ గైడ్స్‌గాను ఎన్నికైయ్యారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన యూత్ హాస్టల్ వార్డెన్ మోహన్‌రెడ్డికి, పోలీస్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఆవులపాటి బుజ్జిబాబుకు ఘన సన్మానం



తిరుపతి కలెక్టరేట్, జూన్ 17 ప్రభాతవార్త : ఏపీ బీసీ సంక్షేమం సంఘం జిల్లా అధికారి ప్రతినిధిగా ఆవులు పాటి బుజ్జిబాబు నియమితులైయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పెద్దకాపు లేఅవుట్‌లోని ఎస్ఎల్ఎస్ రెసిడెన్సీలో ఏపీ నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు కె. నారాయణ, శివకుమార్, ఆవుల పాటి రాఘవలు, శ్రీరాములు, అసోసియేషన్ నేతలు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుచానూరు పంచాయతీ నూతన కార్యదర్శిగా మణి



తిరుచానూరు, జూన్ 17 ప్రభాతవార్త : తిరుచానూరు పంచాయతీ నూతన కార్యదర్శిగా మణి బాధ్యతలు చేపట్టారు. అంత ముందుగా రేణిగుంట పంచాయతీలో విధులు నిర్వహించి సాధారణ బదిలీ మేరకు తిరుచానూరు పంచాయతీ పూర్తిస్థాయి కార్యదర్శిగా విధులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆశీస్సులతో మేజర్ పంచాయతీకి పూర్తిస్థాయి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడంతో సంతోషం వ్యక్తం చేశారు. పద్మావతి అమ్మవారి భక్తుల దృష్ట్యా పారిశుద్ధ్యం మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యం అని అన్నారు. అదే విధంగా గ్రామ ప్రజల అవసరార్థం తాగునీరు విద్యుత్ దీపాలు క్రమబద్ధీకరించి అత్యుత్తమ సేవలందిస్తానని అన్నారు. అనంతరం పంచాయతీ పన్నుల బకాయిలను పూర్తిస్థాయిలో వసూలు చేయుటకు కృషి చేయాలని ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తమకు సహకరించాలని కోరారు. మొండి బకాయిలు కలిగిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలు ఏ సమస్య వచ్చినా నేరుగా తన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేయవచ్చని వారి ఫిర్యాదు మేరకు తక్షణమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

## గంగమ్మకు సారె అందించిన దేశం నాయకులు



శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త: పానగల్ గంగమ్మ జాతర సంబరాలు మంగళవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి అనుబంధ ఆలయాలు, సమీపంలోని ఆలయాలకు 'సారె సమర్పించే' సంప్రదాయాన్ని నాలుగేళ్ళ నుంచి ప్రవేశ పెట్టారు. ఈ నేపథ్యంలో శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ తెలుగుదేశం, బిజెపి నాయకులు అంగరంగ వైభవంగా గంగమ్మకు దేవస్థానం తరపున సారె అందించారు. ఈ కార్యక్రమాల్లో బృందమ్మతో పాటు మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, పట్టణ యువత నాయకుడు సత్రవాడ ప్రవీణ్‌కుమార్, ఆనంద్‌గౌడ్, ఢిల్లి కుమార్, కంఠారమేష్. మునిశేఖర్, మల్లీశ్వరమ్మ, దేవీమోహన్, భాస్కర్‌గౌడ్, హేమంత్‌కుమార్, ఆర్యుగం,పోలూరు శ్రీనివాసులు రెడ్డి, జయకృష్ణ, చంద్రమ్మ, వంకాయల సిద్దులయ్య,గంగల పూడి హరి, ఖాదర్‌బాషా, లక్ష్మీనారాయణ, బత్తిరెడ్డి, ఆలయాధికారులు ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, హరియాదవ్, అర్ధగిరి, దక్షిణామూర్తి తదితరులు హాజరుకాగా సారెను పానగల్ గంగమ్మ కమిటికి అందించారు.

## భూసారం కొరకు జీలుగ, జనుము పంటలు

తిరుపతిరూరల్, జూన్17 ప్రభాతవార్త: భూసారం పెంపుదల కోసం జీలుగ, జనుము పంటలు వేసుకొని, పక్కానికి రాగానే భూమిలో కలియదున్నాలని వ్యవసాయాధికారి ఏవి.సుబ్బారావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం కొత్తూరు, మిట్టమీదకండ్రిగలో నిర్వహించారు. వరి పంటలో మేలైన యాజమాన్య పద్దతుల గురించి వివరించారు. భూసార పరీక్షలు ఆధారంగా ఎరువుల వాడకం, భాస్వరం, ఎరువులు అడుగులోనే వేయాలని సూచించారు. పోటాష్, ఎరువులు అడుగులో వేయుట, సూక్ష్మ పోషకాలైన జింక్ సల్ఫేట్ వాడకం గురించి రైతులకు వివరించారు. ఆధునిక పద్దతులలో యంత్రంతో వరినాట్లు ఏవిధంగా విత్తు కోవాలో తెలిపారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకంలో ఇంకా మిగిలి ఉన్న 200మంది రైతులు వెంటనే ఇకెవైసి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారిణి ఉహ, వ్యవసాయ విస్తరణాధికారి ప్రజ్ఞ, వ్యవసాయ సహాయకులు జానకిరామ్, రైతులు పాల్గొన్నారు.

## సెక్షన్ 164 బిఎన్ఎస్ఎస్ సక్రమంగా అమలు చేయండి



తిరుపతిరూరల్, జూన్17 ప్రభాతవార్త: తిరుపతిఅర్బన్ పరిధిలోని అక్కారంపల్లి గ్రామ లెక్కదాఖల సర్వేనెంబర్ 11/2బి2లో ఉన్న 12.5 సెంట్లు భూమి రుద్రరాజు సంపూర్ణమ్మ పేరుపై 1981లో రిజిష్టర్ చేయబడి ఉందని, ఆస్థలాన్ని తిరుపతి ఎమ్మెల్యే అనుచరులు ఆక్రమించే ప్రయత్నం చేసారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ మేరకు మంగళవారం తిరుపతిఅర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో ఉప తహశీల్దార్ కిరణ్ కలిసి వినతిపత్రం అందజేసారు. తన అనుభవంలో ఉన్న రూ.4.5కోట్ల రుపాయాల ఖరీదైన భూమిని దౌర్జన్యంగా ప్రవేశించే ప్రయత్నం చేయగా, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టి తీసుకెళ్ళినట్లు తెలిపారు. ఆక్రమిత స్థలంలో సెక్షన్ 164బిఎన్ఎస్ఎస్‌ను అమలు చేయాలని తిరుపతిఅర్బన్ తహశీల్దార్‌ను ఆదేశించారు. సెక్షన్ 164బిఎన్ఎస్ఎస్‌ను సక్రమంగా అమలు చేయలేదని, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఎమ్మెల్యే అనుచరులు ఆ స్థలంలో అసాంఘిక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంపూర్ణమ్మ, నీరజ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు వితరణ



చంద్రగిరి, జూన్ 17 ప్రభాతవార్త: స్థానిక భవిత పాఠశాలలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు కె.ఎస్.చక్రధర్ బింధుమాదవి దంపతులు ఎఫ్ఎం, యుఎస్‌బి, హ్యాండ్ మైక్ వితరణ చేశారు. ప్రత్యేక అవసరాలు గల భవిత పాఠశాలను మంగళవారం ఐఈ జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవితలో కె.ఎస్.చక్రధర్ బింధుమాదవి దంపతుల కుమార్తె కె.ఎస్.తుషార భవితలో గత నాలుగేళ్ళుగా శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తమ కుమార్తెతో సహా మరి కొందరు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిత్యం శిక్షణ కొరకు దోహదపడే ఎఫ్ఎం, యుఎస్‌బి, హ్యాండ్ మైక్‌ను వితరణ చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో దాతలను ఆయన అభినందించి, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టిలు ఎస్.వెంకట రాజేశ్వరీ, ఎస్.శ్యామలాదేవి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిశంకరలో హెచ్‌సిఎల్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతం



గూడూరు, జూన్ 17 ప్రభాతవార్త : ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, గూడూరు తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో స్థిరమైన విద్యా సౌకర్యాలను అందిస్తూ పరిశ్రమలతో ముడిపడిన నైపుణ్యా భివృద్ధికి నిలయంగా పేరొందిన ఈ కళాశాల, తాజాగా మరో ఘనతను తన ఖాతాలో వేసుకుంది. న్యూఢిల్లీకి చెందిన స్మార్ట్ బ్రెయిన్స్ సంస్థ సహకారంతో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించగా, 2026 బ్యాచ్‌కు చెందిన 40 మంది విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణం. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కి ప్రముఖ ప్రతినిధులు సత్యేంద్ర బంసాల్, బినిత్ కుమార్ హాజరై విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించారు. సంస్థ సంస్కృతి, అభివృద్ధి అవకా శాలు, శిక్షణా విధానాల గురించి సమగ్రంగా వివరించారు. విద్యార్థుల పనితీరు ఆధారంగా వార్షిక వేత నం రూ. 2.24 లక్షల నుండి రూ.2.77 లక్షల వరకు నిర్ణయించబడింది. ప్రదర్శనతో పాటు సంస్థలో కొనసాగుతున్న శిక్షణ విధానాల వల్ల ఉద్యోగస్తుల వృద్ధి కూడా నిర్ధారితమవుతుంది. ఈ విజయాన్ని పురస్కరించుకొని ఆదిశంకర విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ డా. వంకి పెంచలయ్య మాట్లాడుతూ, ఇది నల్లూరు, తిరుపతి ప్రాంతాల గ్రామీణ యువతకు కార్పొరేట్ ప్రపంచంలో ప్రవేశించేందుకు బలమైన వేదిక. ఇది విద్యాసంస్థ-పరిశ్రమ అనుబంధానికి నిదర్శనం"అన్నారు.డైరెక్టర్ డా.రాజా మురుగదాస్ మాట్లాడుతూ, ఈ విజయానికి ముఖ్య కారణం మా విద్యార్థుల పట్టుదల, సిడిసి టీమ్, ట్రైనింగ్ టీమ్ వేసిన ప్రణాళిక. ఈ విజయవంతమైన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో డీన్ -ఐ క్యూబ్ డా. టి. వేను మాధవ్, డీన్-సిడిసి శ్రీనివాస్, టీపీఓ అర్చన ప్రముఖంగా పాల్గొన్నారు. ఈ విజయంతో ఆధిశంకర కళాశాల పరిశ్రమల నమ్మకాన్ని చూరగొన్న సంస్థగా నిలవడమే కాకుండా, విద్యార్థులకు ఒక సమగ్ర అభివృద్ధి వేదికగా నిలుస్తోంది. ఈ విజయవంతమైన ప్లేస్‌మెంట్ డ్రైవ్ గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ రంగంలోకి ప్రవేశించేందుకు తెరతీసింది. ఇది విద్యారంగంలో ఆదిశంకర ఔన్నత్యానికి నిదర్శనమన్నారు.

# గూడూరు డివిజన్

## ప్రభుత్వ పథకాలపై సమీక్ష



కోట, జూన్ 17 ప్రభాతవార్త: ప్రభుత్వ పథకాలపై కోట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిడిఓ దిలీప్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం పథకంలో ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారిని కూడా లిస్టవుట్ చేయాలని సూచించారు. కొత్త పెన్షన్ల కోసం అర్జీలు పెట్టుకుంటే, వాటన్నింటినీ నిశితంగా పరిశీలించాలని కోరారు. వేసవి కాలం నేపథ్యంలో మంచినీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ పథకాలపై సమీక్ష

కోట, జూన్ 17 ప్రభాతవార్త : ప్రభుత్వ పథకాలపై కోట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిడిఓ దిలీప్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం పథకంలో ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారిని కూడా లిస్టవుట్ చేయాలని సూచించారు. పన్నులను సచివాలయాల పరిధిలో నూరుశాతం వసూలు చేయాలని కోరారు. మండలంలో పారిశుధ్యం పనులు మెరుగుపరచాలని సూచించారు. కొత్త పెన్షన్ల కోసం అర్జీలు పెట్టుకుంటే, వాటన్నింటినీ నిశితంగా పరిశీలించాలని కోరారు. వేసవి కాలం నేపథ్యంలో మంచినీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని కోరారు.

## దేశ చరిత్రలో అద్భుతమైన పథకం తల్లికి వందనం

**-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అమలుచేస్తున్న తల్లికి వందనం పథకం దేశ చరిత్రలోనే అద్భుతమైన పథకమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. ప్రతి ఇంటిలోనూ చదువుకునే పిల్లలు ఎంత మంది వుంటే అంతమందికి కూడా ఒకొక్కరికి రూ. 15,000 వేలు అందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 67.27 లక్షల మందికి రూ. 10,091 కోట్లు విడుదల చేసినట్టు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరి నియోజకవర్గంలో 27,792 మంది విద్యార్థులకు రూ. 36.13 కోట్లు అందించినట్టు తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థికి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు కూడా తల్లికి వందనం అమలు చేస్తున్నట్టు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు చదువుకునే విద్యార్థులందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటికి ఒక్కరికే పథకం అమలు చేసిందని తెలిపారు. జగన్ పాలనలో కేవలం 42 లక్షల మందికి మాత్రమే అమ్మ ఒడి ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం ఒక ఇంట్లో ఎంత మంది చదవితే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు వేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందని పేర్కొన్నారు.

## గంగమ్మ మారుజాతర వేడుకలు ముగింపు



తిరుపతి(రవాణ),జూన్ 17ప్రభాతవార్త: చల్లంగా చూడవమ్మా గంగమ్మా మొక్కుకుంటూ రకరకాల వేషధారణలతో రాయలసీమరంగస్థలి కళాకారులు గంగమ్మకు మొక్కులుతీర్చుకున్నారు. కన్నులపండువగా అత్యంత వైభవంగా ఐదవవారం చివరి మారుపొంగళ్ళు జాతరను తలపించాయి. తాతయ్యగుంట గంగమ్మ జాతర తరువాత వచ్చిన ఐదవవారం మంగళవారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు వేషధారణలతో ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతర తరువాత జరుపుకునే ఐదు మంగళవారాల్లో రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ రకాల సాంప్రదాయ వేషధారణలతో గంధంవేషాలతో జేజేలు పలుకుతూ మంగళ వాయిద్యాల నడుమ గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. గంగమ్మతల్లి దీవెనలతో ప్రజలందరూ సంతోషంగా, చల్లంగా ఉండాలని,ప్రజలు ఆనందంగా ఉండాలని గోపీనాథరెడ్డివేడుకున్నారు. ఇక్కడ అమ్మవారికి కళాకారులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి,నాగేశ్వరరావు,మేకల గంగయ్య, విద్వాన్ కస్పా పద్మనాభం, మోహన్‌రెడ్డి, మునినాథరెడ్డి, మురళి, విగ్రహాలకళ్యాణి, సిద్ధమ్మ, కోదండపాణి, చంద్రబాబునాయుడు, వాసు, యశ్విని తదితరులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ జయకుమార్ కళాకారులకు స్వాగతం పలికారు

## స్విమ్స్‌లో కోవిడ్‌పై ఉన్నత స్థాయి సమీక్ష

తిరుపతి హెల్త్, జూన్ 17 ప్రభాతవార్త : స్విమ్స్‌లో మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. స్విమ్స్ సంచాలకులు, ఉప కులపతి డాక్టర్ ఆర్.వి కుమార్ మాట్లాడుతూ స్విమ్స్ ఆస్పత్రి నందు కోవిడ్ పేషంట్లకు కావాల్సిన అన్ని వైద్య సామాగ్రిని, బెడ్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఇప్పుడున్న ఆరు బెడ్ల స్థాయిని మరింత పెంచుకోవాలని సూచించారు. కోవిడ్ వ్యాప్తి చెందుతున్నట్లు సమాచారం వచ్చిన వెంటనే డాక్టర్లు వైద్య సేవలు చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్లు పాల్గొన్నారు.

## 25న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

బాలాయపల్లి, జూన్ 17 ప్రభాతవార్త: ఈ నెల 25న ఉదయం 10.30 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని వెలుగు సమావేశ మందిరం నందు ఎంపిపి గూడూరు భాస్కరరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ కే.శ్రీనివాసులు తెలిపారు. త్రాగునీరు, వైద్యఆరోగ్య,గృహ, వ్యవసాయ విద్యుత్ ఇంకా పలు సమస్యలపై సమావేశంలో చర్చ జరుగుతుందన్నారు. సర్పంచులు, మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా సదరు సమావేశంకు హాజరు కావాలని కోరారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వెంకటగిరి, జూన్ 17 ప్రభాతవార్త: ఈనెల 18వ తేదీ మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ తనుజారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తారని తెలిపారు.

## తహశీల్దార్‌గా జీవి నరసింహారావు

వెంకటగిరి, జూన్ 17 ప్రభాతవార్త : తహశీల్దార్‌గా జీవీ నరసింహారావు నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర ఉత్తర్వులు జారీ చేశారు. నరసింహారావు సూళ్లూరుపేట తహశీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి వదిలేయారు. డిప్యూటీ తహశీల్దార్ రాంబాబు ఇన్చార్జి తాసిల్దారుగా గత కొన్ని నెలలు వ్యవహరించారు. ఎట్టకేలకు రెగ్యులర్ తహశీల్దార్‌ని నియమించారు.

## పాలస్తీనాకు సంఘీభావం తెలియజేసిన సిపిఎం



గూడూరు, జూన్ 17 ప్రభాతవార్త : పాలస్తీనా ఇరాన్‌లపై అమెరికా అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమాన్ని వెంటనే ఆపాలని, సంఘీభావ నిరసనలో భాగంగా జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తిరుపతి జిల్లా గూడూరులో పట్టణంలో సి.పి.ఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం రోజు పాత బస్టాండ్‌లోని డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ముందు గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు పామంజి మణి, బి.వి.రమణయ్య, భవన నిర్మాణ సంఘ సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, నాయకులు అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య, ఎంబేటి చంద్రయ్య, గుర్రం రమణయ్య, ఆటోసంఘం నాయకులు వి.భాస్కర్‌రెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## హార్ట్‌ఫుల్నెస్ సంస్థచే యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాలు



చిల్లకూరు, జూన్ 17 ప్రభాతవార్త: చిల్లకూరులోని విద్యా నికేతన్ కళాశాలలో హార్ట్ ఫుల్నెస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్క రించుకొని యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు శశికళ మాట్లాడుతూ శరీరానికి యోగా ఎంత అవసరమో, ధాన్యం కూడా అంత అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ నరేష్, హార్ట్ ఫుల్నెస్ సంస్థ ప్రిసెప్టర్ రజిని జైన్, రాజేంద్ర కుమార్, మురళీ కృష్ణారెడ్డి, లక్ష్మి, జాఫర్ అలీ, రజినీకాంత్, బాబురావు, అనసూయమ్మ, సంగీతమ్మ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలి



గూడూరు, జూన్ 17 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాలను వెంట నే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్‌లు పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ మెడికల్ శానిటేషన్ కాంట్రాక్ట్ యూనియన్ కార్మికు ల పార్టీ శాఖ మహా సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు తలారి మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గూడూరు, జూన్ 17 ప్రభాతవార్త: స్థానిక ఎస్.కే.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం నుండి ప్రతిరోజు యోగా సనాలు వాటిపై అవగాహన మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శివప్రసాద్ మాట్లాడుతూ యోగాసనాలపై అవగాహన పెంచుకొని ప్రతిరోజు యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్య పరిపుష్టి కలిగి ప్రశాంతమైన జీవన విధానాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ బి.పీర కుమార్ ఇటీవల యోగ మీద గేయం రాయడం, అది ప్రముఖుల ప్రశంసలు అందుకోవడం చాలా అభినందించదగిన విషయమని పీర కుమార్‌ను ప్రశంసించారు. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. నారాయణ రాజు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. పీర్ కుమార్, శ్రీధర్ శర్మ, డాక్టర్ యూస్నీ వాణి, డాక్టర్ శైలజ, కిరణ్మయి, కృపా కరుణ వాణి, భీమవరపు లక్ష్మి, కె రవి రాజు, హిమబిందు, సుందరమ్మ తదితర అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు నీటి సరఫరాకు అంతరాయం

గూడూరు, జూన్ 17 ప్రభాతవార్త : కండలేరు నుండి వేములపాలెం వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వరకు ఉన్న మెయిన్ లైన్‌కు మూడుచోట్ల లీకులు ఏర్పడిన కారణంగా మెయిన్ లైన్ మరమ్మతులు జరుగుతుండడంతో గురువారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పత్రిక ప్రకటనలో గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## కూటమి ప్రభుత్వం మోసం చేసింది



ఓజిలి,జూన్ 17 ప్రభాతవార్త : 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సూపర్ సిక్స్‌తో సహా పలు హామీలు ప్రకటించి నేడు వాటిని అమలు చేయకుండా ప్రజలను నయవంచ నకు గురి చేస్తోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి పేదప్రజలంటే లెక్కలేనితనమని, పేదలను చిన్నచూపు చూడడం దుర్మార్గమని కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా మోసపూరితమని సూపర్ సిక్స్ హామీలు మొత్తం అమలు చేశామని ఎవరైనా సూపర్ సిక్స్ పథకాలు గురించి మాట్లాడితే నాలుకలు కట్ చేస్తామంటూ సాక్షయాత్తు సీఎం చంద్రబాబు చెప్పడం సిగ్గు చేటని మండల ఎంపీపీ గద్దం అరుణారెడ్డి, వైకాపా మండల అధ్యక్షులు పాదర్తి హరనాథ్ రెడ్డి మండిపడ్డారు. జగనన్న ప్రభుత్వంలో మొదటి ఏడాది పాలనలో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను 95 శాతానికి పైగా అమలు చేశారన్నారు. అమ్మఒడి ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకంలో రెండు వేలు పాఠశాల అభివృద్ధికి ఇస్తే దానిని కూడా దోచేశారని చెప్పిన లోకేష్ నేడు దొడ్డి దారిన అదే నగదును నొక్కి సిందుకు కుట్రలు పన్నుతు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు హరనాథ్ రెడ్డి, మండల ఎంపీపీ గద్దం అరుణా రెడ్డి, వైకాపా సీనియర్ మాజీ మండల కన్వీనర్ వైకాపా సీనియర్ నేత దేశి రెడ్డి మధుసూదన్ రెడ్డి, వెంకటసుబ్బ రాజు, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్ నాయుడు, కొండూరు దామోదర్ రాజు, ఎంపీటీసీ రఘురాం రాజు, సర్పంచ్ ప్రభాకర్, సురేష్ రెడ్డి, ప్రసాద్ నాయుడు, పిండూకూరు. మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామయ్య, మహేష్,కొండూరు మురళి రాజు, జయరాం రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కొలనుకొదురు. సురేష్ రెడ్డి, షేక్ అహమతుల్లా, వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకుంటుంది : జిల్లా కలెక్టర్



రేణిగుంట, జూన్ 17 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. రేణిగుంట మండలం ఎస్ఎన్ పురం శ్రీ వర్ష ఫుడ్ ప్రోడక్ట్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కర్మగారాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సందర్శించారు. కర్మాగారంలో నిల్వ ఉంచిన మామిడికాయలను పరిశీలిం చారు. కంపెనీలో దాదాపు 250 నుండి 300 టన్నుల వరకు మామిడి కాయలు నిల్వ ఉంచుకుని సామర్థం ఉందని కంపెనీ చైర్మన్ విశ్వనాథ నాయుడు ద్వారా తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రస్తుతం 15 రైపనింగ్ చాంబర్స్ నందు పూర్తిస్థాయి మామిడికాయల నిల్వలు ఉన్నాయని వివరించారు. నిల్వ ఉండటం వల్ల రైతుల నుండి మామిడికాయలు అన్లోడ్ చేయలేకపోతున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ కు మామిడి పండ్లను శుద్ధి చేసే ప్రక్రియను వాటి నుండి గుజ్జు తయారు చేసే విధానాన్ని పరిశ్రమల డైరెక్టర్లు విశ్వాస్, వర్షాల వివరించారు. యూనిట్ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరివేక్షించారు. అనంతరం ఆయన మామిడి రైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తోతాపురి రకం మామిడికాయలు పూర్తి కాపు అయ్యేంతవరకు స్థానిక మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమల కేంద్రాలు రైతుల నుండి మామిడికాయలు తీసుకుంటా యన్నారు. రైతులకు పరిశ్రమ యజమానులు కేజీకి 8 రూపాయలు ప్రభుత్వం రైతులకు మరో నాలుగు రూపాయలు అదనంగా సబ్సిడీ ఇస్తుందన్నారు. తోతాపూరి పండించే మామిడి రైతులను ఆదుకోవడానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి పరిశ్రమ వద్ద ఉద్యానవనశాఖ, రెవిన్యూ అధికా రులు ఉంటారన్నారు. వారే రైతులు తీసుకువచ్చిన మామిడి కాయల బరువును నమోదు చేసుకుంటా రని తెలిపారు. అనంతరం ప్రభుత్వం అందించే సబ్సిడీ నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామ న్నారు. మామిడి రైతులు తీసుకొచ్చే సరుకు వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్ నందు పొందు పరచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముందుగా స్థానిక రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని పరిశ్రమల యజమానులకు సూచించారు. టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టి లోడుతో వచ్చిన వాహనాలకు టోకెన్లు ఇచ్చి ఆర్డర్ మెరిట్లో కాయలు డౌన్లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీ ఎంఐపిడి సతీష్, మార్కెటింగ్ ఏడి సురేంద్రబాబు, రేగుంట తహసిల్దార్ సురేష్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు..

## రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



కోట, జూన్ 17 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి నాయకులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, జడ్పిటిసి సభ్యులు దాసరి కోటయ్య, మాజీ జడ్పిటిసి సభ్యులు ఉప్పల ప్రసాద్‌గౌడ్, నాగూర్‌రెడ్డి, గూడూరు డివిజన్ యువజన నాయ కులు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళ వారం కోట క్రాస్‌రోడ్డులోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై తప్పుడు కేసులు బనాయించి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శశిధర్‌రెడ్డి, మండల జాయింట్ సెక్రటరి పాముల సురేంద్ర, మహిళా నాయకురాలు సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 38 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం

కోట, జూన్ 17 ప్రభాతవార్త: ప్రాథమిక విద్యలో ప్రభుత్వ సంస్కరణలతో అధిక శాతం పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరింది. జీఓ 117 రద్దు అనంతరం గతంలో స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన వారిని ఎక్కడ సర్దుబాటు చేయాలనే సమస్య తలెత్తింది. ఇదే సమయంలో 60 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూలుగా మార్చి అక్కడ ఒక పిఎస్ హెచ్‌ఎం పోస్టును కేటాయించడంతో పాటు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా ఏర్పాటు చేయడంతో కోట మండలంలో పోస్టులు సర్దుబాటు అయ్యాయని ఎంఇఓ మస్తానయ్య చెప్పారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ కోట మండలంలో 38 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలిగిందని చెప్పారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

కోట,జూన్ 17 ప్రభాతవార్త : కోట మండలంలోని ఊనుగుంటపాళెం, గూడలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సుచ్చేంద్ర ప్రసాద్ ఆయా గ్రామాల్లో రైతులకు సాగులో యాజమాన్య పద్ధతులు,సస్యరక్షణ చర్యలు ,చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు.తక్కువ పెట్టుబడితో రైతుల అధిక దిగుబడుల సాధించేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.రైతులను ప్రకృతి సాగు వైపు మళ్లించేలా ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 5 ఎకరాలకు పైగా ఉన్న వారిని గుర్తించి వారితో కనీసం ఎకరంలో అయినా సాగు క్రమీపీ విస్తరించేలా ప్రణాళికలు రూపొందించడం జరుగు తుందన్నారు.

వ్యవ సాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం పొలం పిలుస్తోందన్నారు. కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెడ్ బుక్‌ను పక్కన పెట్టి...ఆడపిల్లలకు రక్షణ కల్పించండి

**-మాజీ మంత్రి ఆర్.కె.రోజా**



పుత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో భర్త చేసిన అప్పులకు భార్యను చెట్టుకు కట్టి దాడి చేశారంటే రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఎంత దుస్థితిలో వుందో అర్థమవు తోందని వైసిపికి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా సోమవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా ఆడపిల్లల జోలికి వస్తే ఆదే వారికి చివరి రోజు అవుతుందని ప్రకటించిన చంద్రబాబు కుప్పం సంఘటనకు ఏం సమాధానం చెపుతారని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అరాచకం సృష్టిస్తున్నారన్నారు. ఒక మహిళ హోమ్ మంత్రిగా వున్నా మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టలేకపోతున్నారన్నారు. పరిటాల సునీత నియోజకవర్గంలో ఒక అమ్మాయిని టిడిపికి చెందిన 14 మంది అత్యాచారం చేస్తే హోమ్ మంత్రి అనిత కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించలేదని విమర్శించారు. అనంతపురంలో ఇంటర్ చదువుతున్న ఒక గిరిజన బాలిక పోలీసుల నిర్లక్ష్యం వల్ల చనిపోతే హోమ్ మంత్రి ఏవిధమైన చర్యలు చేపట్టలేదన్నారు. బాధితులను సెల్ ఫోన్‌లో వీడియో కాల్‌లో పరామర్శించడం బట్టి హోమ్ మంత్రి ఎంత అహంకారంతో వున్నారో తెలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలపై చిన్న చూపు చూస్తోందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్, హోమ్ మంత్రి అనిత ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని, టిడిపి వాళ్లు తప్పు చేసినా శిక్షించాలని హితవు పలికారు.

## పనులు వేగవంతం చేయండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 17 ప్రభాతవార్త: వినాయక సాగర్ అభివృద్ధి పనుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం వినాయక సాగర్‌ను, కొర్లగుంట వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినాయక సాగర్‌లో స్విమ్మింగ్ పూల్, గ్లో గార్డెన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాగర్ వాకింగ్ ట్రాక్ నందు పెరిగిన మొక్కలు కత్తిరించి వాకర్స్ కు ఇబ్బంది లేకుండా చేయాలని అన్నారు. అక్కడ ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటాలని అన్నారు. సాగర్ ను పరిశుభ్రంగా ఉంచి, ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా ఏర్పాటు చేయాలని అన్నారు. కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈ.ఈ.రవి, డి.ఈ. రమణ, రాజు, వెంకట ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## యోగాంధ్ర ఏర్పాట్లు పరిశీలన



శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో ఈ నెల 21 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాలను పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి లో భారీ ఎత్తున నిర్వహించుటకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ నిర్ణయించారు. ఇందుకు ప్రత్యేక కమిటిని కూడా నియమించారు.ఈ కమిటి సారథ్యం లో మంగళవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. ఇందులో ఆలయానికి సమీపంలోని రాజగోపురం వద్ద పరిస్థితి అనుకూలంగా ఉందని నిర్ణయించారు. ఇక్కడ ఏర్పాట్లుకు అధికారులు సమాయత్తమౌతున్నారు. ఈ ఏడాది యోగాంధ్రను 21న విశాఖ తీరంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డెప్యూటి ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సారధ్యంలో నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలోనే శ్రీకాళహస్తిలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగే కార్యక్రమాల ఏర్పాట్లను మంగళవారం ప్రత్యేకాధికారి సుస్మిత, శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓ టి.బాపిరెడ్డి, డివైయస్‌పి నరసింహామూర్తి,మున్సిపల్ కమిషనర్ సంజీవ్ కుమార్, వన్‌టౌన్ సిఐ డి.గోపి,ట్రాఫిక్ ఎఎస్ఐ గోవిందు,అధికార బృందం పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీల యజమానిపై కఠిన చర్యలు తప్పవు - జిల్లా కలెక్టర్

కేవీబీ పురం, జూన్ 17 ప్రభాతవార్త: మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు చెల్లించకపోతే ఫ్యాక్టరీల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ హెచ్చరించారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలోని గ్రో ఫ్రూట్స్ మ్యాంగో ఫ్యాక్టరీ కంపెనీని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా మంగళవారం మధ్యాహ్నం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మామిడి పంట రైతులకు దేవరాజ్ ఫ్రూట్స్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీ ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మామిడి పంట రైతులకు ఫ్యాక్టరీ ఇస్తున్న 8 రూపాయలతో పాటు ప్రభుత్వం అందించే 4 రూపాయలు కలిపి వారి వారి అకౌంట్లో జమ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నియామ నిబంధనలను పాటించకపోతే ఫ్యాక్టరీ యజమానులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఎంపీడీవో మాలతి, పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీ శైలజ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, కూటమి నాయకులు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు థామస్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బాబు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, తహసీల్దార్, సిబ్బంది, ఫ్యాక్టరీ యాజమాన్యం, మామిడి రైతులు పాల్గొన్నారు.


